www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 ఆగస్టు 2023
5
అన్నమయ్య

స్కిప్పింగ్‌లో మదనపల్లె విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత నెల 29, 30న కర్నూలు జిల్లాలోని గార్గేయపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో మదనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని 34 మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్బారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

పసుపు ధరలకు రెక్కలు

పసుపు ధరకు రెక్కలొచ్చాయి. ధర రోజు రోజుకు పెరుగుతుండడంతో రైతులు, వ్యాపారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. మూడు సంవత్సరాలుగా మార్కెట్‌లో పసుపుకు ధర లేదు. ప్రస్తుతం మంచి ధర లభిస్తోంది. పసుపు కొనుగోలు ప్రారంభంలో రూ.4600లు వుండేది. శుక్రవారం నుంచి బహిరంగ మార్కెట్‌లో క్వింటా ఫింగర్ పసుపు ధర రూ.10,025లు పలికింది.. ముందుగా తక్కువ ధరలతో విక్రయించుకున్న తర్వాత ప్రస్తుతం ధరలు పెరిగాయని రైతులు, రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

క్వింటాకు రూ.10,025 చెల్లింపు
రైతుల్లో ఆనందోత్సాహాలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

2022–23 ఏడాదిలో ఉమ్మడి జిల్లాలోని పోరుమామిళ్ల, సిద్దవటం, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, జమ్మలమడుగు, దువ్వూరు, ఒంటిమిట్ట, రాజంపేట, రైల్వేకూడూరు, చిట్వేలి, నందలూరు, ఓబులవారిపల్లెలతో పాటు పలు మండలాల పరిధిలో 4,122 మంది రైతులు 4783.500 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం పసుపుకు రూ.6,850లు మద్దతు ధర కల్పించింది. రైతులు పండించిన పసుపును మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుండి పసుపు కొనుళ్లను ప్రారంభించింది. పసుపు కొనుగోలు ప్రారంభంలో పసుపు క్వింటాలు రూ.4 వేల నుంచి రూ.4,600లు ఉండేది. అనంతరం ధర రాను రాను పెరుగుతూ వచ్చింది. చాలా మంది రైతులు విక్రయించుకోగా, మరి కొంత మంది ఇళ్లల్లో స్టాక్ ఉంచుకున్నారు. ప్రారంభంలో పసుపు ధరలు తక్కువగా వుండడంతో ప్రభుత్వం రూ.6,850లు ప్రకటించడంతో రైతులు వ్యాపారులకు పసుపును అమ్మేందుకు ఆసక్తి చూపలేదు. వ్యాపారులు కూడా రేటు పెంచాల్సి పరిస్థితి నెలకొంది.

క్వింటా రూ.1025

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బుధవారం క్వింటాలు ఫింగర్ పసుపు ధర రూ.10,025లు కాగా, బల్బ్ పసుపు (ఉంట కొమ్ము) రూ.10 వేలులు పలికింది. బహిరంగ మార్కెట్‌లో పసుపు తక్కువగా వస్తుండడంతో పసుపు రేటుకు డిమాండ్ పెరిగింది. ఈ నెల 12వ తేదీ నుండి పసుపు ధరలుపెరుగుతూ వచ్చాయి. ఈ నెల 12వ తేదీన క్వింటా ఫింగర్ పసుపు ధర రూ.7వేలు పలికింది. పసుపు రేట్లు ఈ నెల 12 నుండి పెరుగుతూ వచ్చి ప్రస్తుతం ఫింగర్ పసుపు క్వింటాలు రూ.10,025లుకు చేరుకొంది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెటింగ్ మాయే

రైతులు పసుపు పంటను విక్రయించుకున్న తర్వాత రేట్లు పెరగడం మార్కెటింగ్ మాయే. పసుపు కొనుగోలు మొదట్లో క్వింటాలు రూ.4,600 ఉండేది. పంటను విక్రయించుకున్న తర్వాత రేట్లు పెరగడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదు. స్టాక్ ఉంచుకుని విక్రయించు కుంటున్న రైతులకు లాభదాయకం.

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం. కడప.

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి


లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, అన్నమయ్య రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభా వంతులకు ట్రై సైకిల్స్, త్రీ వీలర్ మోటార్ వెహికల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్‌లను కలెక్టర్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, డిఆర్ఒ సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్హత కల్గిన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. అందరికీ సమాంతరంగా ప్రభుత్వ ఫలాలను అందిస్తుందని వివరించారు. విభిన్న ప్రతిభావంతులకు విలువైన వాహనాలను ప్రభుత్వం వీరికి పూర్తిగా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. దాదాపు వందమందికి ట్రై సైకిల్స్, త్రీ వీలర్ మోటార్ వెహికల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ వివిధ రకాల పరికరాలను అందజేశామన్నారు. త్రీ వీలర్ మోటరైజ్డ్ వెహికల్స్ సుమారు రూ. 45 వేలు విలువ చేస్తుందన్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు నియోజవర్గాల్లో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున క్యాంపు నిర్వహించి అర్హులైన వారందరికీ అన్ని పరికరాలు అందజేస్తామన్నారు. వికలాంగుల కోసం కృత్రిమ పరికరాలు తయారు చేయడానికి కొలతలు తీసుకోవడానికి క్యాంపులు కూడా వికలాంగుల సంక్షేమ శాఖ నిర్వహిస్తుందన్నారు. అర్హులు జిల్లా కేంద్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఒక సంస్థతో మాట్లాడి ఎంతమంది అర్హత ఉంటే అంతమందికి పరికరాలు అందజేయాలని ప్రోత్సహించడంతో, అందుకు కలెక్టర్ మ్యాచింగ్ చేయడంతో ఇప్పుడు వంద మందికి వివిధ రకాల పరికరాలను పంపిణీ చేశామని తెలిపారు. విభిన్న ప్రతిభా వంతులకు పరికరాలు అందజేసినందుకు ముఖ్యమంత్రి, ఎంపీ, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వెళ్ళినప్పుడు వికలాంగుల స్థితిగతులు చెప్పినప్పుడు ఏదో రకంగా సహాయం ఉండాలని ఆలోచనతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే ఇప్పుడు ఎన్ని ఉంటే అన్ని ఇచ్చేద్దాం అన్నారని చెప్పారు. రాజంపేట ఎంపీ మదనపల్లి, తంబాలపల్లి, పీలేరు నియోజకవర్గాల్లో వేలమంది విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు అందజేశారన్నారు. రాబోవు నెల రోజుల్లో రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజవర్గంలో పెద్ద క్యాంపు పెట్టి 2000 మందికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వివిధ రకాల పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. కాళ్లు కోల్పోయిన వాళ్లకు కృత్రిమంగా ఏర్పాటుకు వికలాంగుల సంక్షేమ శాఖ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇ వీటితోపాటు వినికిడి యంత్రాలు కూడా అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం మానవత్వంతో చేస్తున్న దానికి ఇది ఒక నిదర్శనం అన్నారు. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత, నైపుణ్యం ఉంటుందని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించడానికి వికలాంగులకు అంగవైకల్యం అడ్డుకాదని పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వపరంగా విభిన్నప్రతిభావంతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి కిషోర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం మదనపల్లె నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తారని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3వ తేదీన నారా చంద్రబాబునాయుడు పర్యటన ముగించుకుని కొక్కంటి క్రాస్‌లో రాత్రి బస చేసి 4వ తేదీ ఉదయం బయలుదేరి మదనపల్లెకు 10 గంటలకు చేసుకుంటారని తెలిపారు. స్థానిక ప్రజలతో సమావేశం అనంతరం మదనపల్లె దాహార్తిని తీర్చడానికి నిర్మాణం చేపట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు పరిశీలన చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త మదనపల్లె చేరుకోవాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్స్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం జరుగు తోందని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు పాలనలో ఎలాంటి అవినీతి దుర్వినియోగం జరగలేదని నేడు ఇసుక, లిక్కర్ గనుల మాఫియా చెలరేగిపోతోందని నిప్పులు చేరిగారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతోపాటు అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు షంషేర్, నాగుర్‌వల్లి, నాదెళ్ల శివ, గిరీష్, రమణ, రఘుపతి పాల్గొన్నారు.

రేపు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు సిడిపిఒ రాజమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సిఎల్ఆర్‌సి భవనంలో నూతన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇంటికే పంపిణీ చేయు కార్యక్రమ ప్రారంభోత్సవం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పీలేరు మండల ప్రజా ప్రతినిధులు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు కూడా హాజరవుతున్నారని, కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని సిడిపిఒ అంగన్వాడీ కార్యకర్తల తరపున ఆహ్వానించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడలో న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.జనార్ధన్‌రెడ్డి, జి.మనోహర్, జాయింట్ సెక్రటరీ పి.సోమ శేఖర్ తెలిపారు. శుక్రవారం మదనపల్లి న్యాయవాదులు, బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడిని జ్యూడిషల్ వ్యవస్థపై దాడిగా అభివర్ణంచారు. కక్షి దారులకు న్యాయం చేయాలని ఉద్దేశంతోనే లాయర్లు పనిచేస్తారని, వ్యక్తిగతం కాదనీ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు గోపాలకృష్ణ, ఆనంద్‌రెడ్డి, రాంగోపాల్‌రావు, శేఖర్ నాయుడు, వెంకటరమణారెడ్డి, గోపాల్‌రెడ్డిపాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మణిపూర్‌లో మారణహోమం ఆపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

మణిపూర్‌లో జరుగుచున్న దమనకాండ, స్త్రీలపై జరుగుచున్న అత్యాచారాలను అరికట్టి శాంతిభద్రతలను పరిరక్షించాలని ఫాదర్ రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా మదనపల్లి క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో మహార్యాలీ నిర్వహించి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ముందుగా మిషన్ కాంపౌండ్ చిత్తూరు బస్టాండ్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్ సర్కిల్, మల్లికార్జున సర్కిల్ సంతగేటు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి శాంతియుతంగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ వరకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు నెలలుగా బలహీన తెగలకు చెందిన వారిపై జరుగుచున్న దాడులను, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తున్నామన్నారు. స్త్రీలని వివస్త్రను చేసి నడివీధులలో ఊరేగించుటను, అధికార అండదండలతో ఒక తెగ మరొక తెగపై బరితెగించి చేయుచున్న దాడులకు పాల్పడడం దురదృష్టక రమన్నారు. అనంతరం పాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి భారతపౌరుడికి ఇచ్చిన ప్రాథమిక హక్కులు,ప్రభుత్వ అండదండలతో కాలరాయుట క్షమార్హం కాదన్నారు. వెంటనే జాతీయ మైనారిటీ కమీషను, జాతీయ స్త్రీల హక్కుల కమీషన్ వెంటనే స్పందించాలన్నారు. మణిపూర్ ప్రభుత్వం,పోలీసు శాఖ ఈ దుశ్చర్యలను అడ్డుకొని దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు.

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే శరణ్యం : ఎడి

పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ కె.ప్రతాప్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశువులలో వచ్చే లంపీ స్కిన్ వ్యాధికి టీకానే శరణ్యమని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక పశు వైద్య శాలలో పశువులలో వచ్చే లంపీ స్కిన్ వ్యాధికి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేప ట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లా డుతూ పశు యజమానులకు పలు సూచ నలు చేశారు. చర్మం పైన వచ్చే దద్దుర్ల వలన మేత, నీళ్లు తీసుకోలేక నీరసించిపోయి ఒక్కోసారి మరణించే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి రాకుండా అరికట్టేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యాధి నిరోధక టీకాను ప్రతి రైతు తమ పశువులకు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, పశు వైద్య సహాయకులు దత్తాత్రేయ, హరిబాబు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను పురస్కరించుకొని 'లోగో, మస్కట్" పోటీలు నిర్వహించనున్నట్లు స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 7లోపు http://sports.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహు మతి రూ.30 వేలు తృతీయ బహుమతి రూ.20, వేలు ఇవ్వనున్నామని పేర్కొన్నారు.

రామాలయంలో పౌర్ణమి కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

శ్రీకోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు వేద పండితులు శాస్త్రోయుక్తంగా కల్యాణాన్ని కనులపండుగ నిర్వహించారు మండల, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా వచ్చి తిలకించారు స్వామి అమ్మవార్లకు భక్తులు పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో టిటిడి ఆలయ ఇన్‌స్పెక్టర్, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలుంటే చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పీలేరు


గోదాములో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పీలేరు పౌర సరఫరాల గోదామును రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి ఆయన గోదామును తనిఖీ చేసి, అక్కడి బియ్యం, చక్కెర, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. చౌక దుకాణాలకు సరఫరా చేసే వస్తువుల తూకాల్లో తేడా లేకుండా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకుల పంపిణీల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్థానిక తహశీల్దార్ ధనుంజయులు, సిఎస్ డిటి నారాయణరెడ్డి, గోదాము డిప్యూటీ తహశీల్దార్ అనిత, విఆర్ఒ, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ల ఏర్పాటు పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి- రాయచోటి

మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జిల్లాలో సంక్షేమ శాఖలు త్వరితగతిన క్లస్టర్లు ఏర్పాటు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంక్షేమ శాఖల అధికారులతో క్లస్టర్ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ జిఒ ఎంఎస్ నెంబర్ 37 ప్రకారం సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ తదితర అన్ని సంక్షేమ శాఖలు పరిపాలనా సౌలభ్యం కోసం క్లస్టర్ ఏర్పాట్లు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖల సహాయ సంక్షేమ అధికారులతో ఏర్పాటు చేసిన వర్క్ షాప్ నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వివిధ అంశాలపై తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.జాకీర్ హుస్సేన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్ సలాం, జిల్లాలోని ఎస్‌సి, బీసీ సంక్షేమశాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.

పార్క్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పార్క్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పట్టణంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో నిర్మితమవుతున్న మున్సిపల్ చిన్న పిల్లల పార్క్‌లో మహిళలకు పూర్తి రక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, సివిల్ సప్లైస్ స్టేట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్‌లతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పార్క్ నిర్మాణ పనులను పరిశీలించారు. పార్క్ పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.ఒక వారంలోగా ప్లాంటేషన్ పనులు, పదిహేను రోజుల్లోగా ఓపెన్ జిమ్ ఏర్పాటు, త్వరగా గజిబోలు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆకతాయిలుతో ఇబ్బందులు లేకుండా చూడాలని, సిసి కెమెరాలను త్వరగా ఏర్పాటు చేయాలని అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డికి ఎంఎల్‌ఎ సూచించారు. పార్క్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్లు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో మమేకమయ్యారు. అధునాతన వసతులు, సౌకర్యాలుతో పార్క్ ఏర్పాటు అవుచుండడం హర్షణీయమంటూ శ్రీకాంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, పల్లా రమేష్, జానం రవీంద్రా యాదవ్ పాల్గొన్నారు.

హామీలను సత్వరమే నెరవేర్చాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా మునిసిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తీవ్ర ఉద్యమాలు తప్పవని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం నుంచి మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా పురపాలక కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించుకుంటామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయారని పేర్కొన్నారు. సిపిఎస్ పరిష్కరించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల ఏడవ తేదీన మున్సిపల్ కార్మికులతో చలో రాయచోటి ధర్నా కార్యక్రమానికి కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఓబయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, కోశాధికారి డి.లక్ష్మీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

పలు రకాల కూరగాయలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు పరిశీలనాత్మక శక్తి ఉండాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులలో పరిశీలనాత్మక శక్తి ఉండాలని శ్రీ ప్రత్యూష హైస్కూల్ ప్రిన్సిపల్ చందన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో సృజనా త్మక శక్తిని పెంపొందించేందుకు 'వెజిటబుల్‌డే' ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల కూరగాయలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బట్టీ చదువులకు అల వాటు కాకుండా ప్రయోగాత్మక విద్యను అందిం చేందుకు తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దేవప్పకోటకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి-బి కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలోని దేవప్పకోట గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వస్తున్నట్లు ఎంపిపి మహమ్మద్, మడుమూరు సర్పంచ్ నాగరత్న భాస్కర్‌నాయుడు, ఎంపిటిసి సయ్యద్ పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, జడ్‌పి టిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సింగల్ విండో అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, పంచాయతీ సచివాలయం కన్వీనర్లు పాల్గొనాలని తెలిపారు.

9న చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

2009లో ఉమ్మడి రాష్ట్రంలో అనేక పోరాటాల ద్వారా అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటుచేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నేడు ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి నిర్మాణ కార్మికుల కడుపు కొడుతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. పట్టణంలోని జామియా ఫంక్షన్ హాల్లో జరిగిన కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులకు ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కేంద్ర కార్మిక సంఘాలు 9న విజయవాడలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు తంబళ్ళపల్లి నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, సలీంబాషా, వేణు గోపాల్‌రెడ్డి, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

16వ వార్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

16వ వార్డులో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ నడిబొడ్డులో ఉన్న 16వ వార్డు ప్రాంతం ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్లు లేక వర్షం వస్తే జనాలు బయటికి రాలేని పరిస్థితి ఉండేది. ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి 16వ వార్డు సమస్యలను ప్రత్యేకంగా తీసుకొని ఆ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. వీధులలో అడ్డంకులను తొలగిస్తూ వెడల్పు చేయడమే కాక రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. వార్డులో రోడ్డు నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పీలేరు మండలం, సూరకాలపేటకు చెందిన మహమ్మద్‌రఫీ ఆర్థిక సౌజన్యంతో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పిఎస్ హరి నాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని, ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం దాత మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ వృద్ధులకు మంచి భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని, రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్నీ సేవా కార్యక్రమాలు లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లయన్ వి.హరీష్ చంద్, మాజీ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, లయన్‌వినోద్ కుమార్‌నాయక్, సభ్యులు సజీర్‌బాషా, హేమంత్, ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య, దేవనాథ్ రెడ్డి దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది..

మదనపల్లె అర్బన్: అతిక మాసపు పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక బికెపల్లి అమ్మచెరువుమిట్ట దోబీఘాట్‌లోని శ్రీబోయకొండ గంగమ్మ దేవస్థానంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రముఖ ఆర్టిస్ట్ డాక్టర్ శ్రీపతి, శ్రీరామ రజక కో-ఆపరేటివ్ సోసైటీ అధ్యక్షులు వెంకటరమణల సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అమ్మవారి భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పూజలు చేసి,తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు కార్యక్రమంలో ఆదినారాయణ, లక్ష్మికాంతమ్మ, దినేష్, మాజీ కౌన్సిలర్ రమణమ్మ, వరలక్ష్మి, రాధ, సునీత, చిన్నక్క పాల్గొన్నారు.

ఉచిత షుగర్ పరీక్షలు

మదనపల్లె అర్బన్ : పట్టణంలోని స్థానిక మల్లికార్జున సర్కిల్‌లో మదనపల్లె లయన్స్‌క్లబ్ అభయ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి మంగళవారం ఈ ఉచిత డయాబెటిక్ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత యుగంలో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. పూర్తి ఉచితంగా అందించే ఈ వ్యాధి నిర్ధారణ చికి త్సను పట్టణ ప్రజలు, వినియోగించుకోవాలని కోరారు. ఎంలోలయన్స్ క్లబ్ కార్యదర్శి సుబ్బారెడ్డి, ట్రెజరర్ కరుణాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, మహేంద్రబాబు,సాయిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని మదనపల్లి ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి అన్నారు. మంగళవారం నిమ్మనపల్లిలో ఆయన పర్యటించారు. నిమ్మనపల్లెకు చెందిన ఎం.డి.అంజాద్, ఎం.డి.అలాబక్షు, ఎం.డి.అజ్గర్‌ఆలీ లకు సంబంధించిన సర్వేనెంబర్ 1075, 1077, 1078, 1088 లోని 1.80 ఎకరాల ఉమ్మడి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకొనుటకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు మంగళవారం ఆర్‌డిఒ, డిప్యూటీ తహసిల్దార్ తపస్వినితో కలసి భూమిని పరిశీలించారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ ను వివరాలు అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించాం గంగాపురంపల్లి వద్ద మంగళం మునెమ్మ, మంగళం పార్వతమ్మ లకు చెందిన సర్వేనెంబర్ 671/బి లోని 5.15 ఎకరాల ప్రయివేట్ భూమి ప్రభుత్వ భూమిగా నిషేధిత జాబితాలో ఉన్నందున ఆ భూమిని సందర్శించి ప్రయివేట్ భూమిగా పరిగణించినట్లు తెలిపారు. భూ బదలాయింపులు చట్టప్రకారం జరగాలని అన్నారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించి, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్, విఆర్‌ఒలు రజనీకాంత్, శ్రీనివాసులు, విఆర్ఎలు పాల్గొన్నారు.

భూ బదలాయింపుకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మురళి

ఓటర్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహాశీల్దార్ రఫీక్‌అహ్మద్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఓటరు సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని తహాశీల్దార్ రఫీక్ అహ్మద్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా బిఎల్‌ఒలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఎవరైనా చిరునామా మారి ఉన్నా, ఇక్కడికి వచ్చినా, మరణించిన తదితర అంశాలను గుర్తించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. ఈ -ఓటర్ సర్వేని సకాలంలో పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్.ఐ.శ్రీనివాసులు, డిప్యూటీ తహాశీల్దార్ మొహమ్మద్ అన్సారి, ఎంపిడిఒ, ఆఫీస్ అకౌంట్‌ఆఫీసర్ థామస్‌రాజ్, నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలకు ట్రిపుల్‌ఇ సభ్యత్వం ఉపయోగం

-జపాన్ ప్రొఫెసర్ యుకారి షిరోటా

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జపాన్ ప్రతినిధుల బృందం మూడురోజులపాటు కళాశాలను సందర్శించారు. ఇందులో భాగంగా రెండవ రోజు విద్యార్థులు, అధ్యాపకులతో ఇంటరాక్షన్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ యుకారి షిరోటా గకుషుయిన్ విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ టెట్సుజీ కుబోయామా, గకుషుయిన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టకాకో హషిమోటో, చిబా యూనివర్శిటీ ఆఫ్ కామర్స్‌లు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు, ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ టకాకో హషిమోటో మాట్లాడుతూ ట్రిపుల్‌ఇ సభ్యత్వం, వాటి ప్రయోజనం గురుంచి విద్యార్థులకు వివరించారు. ఇంజినీరింగ్ రంగంలో అనేక పరిశోధనలు ఇందులో పొందుపరిచి ఉంటారని, ప్రతి ఒక్క విద్యార్థికీ పరిశోధనలకు ట్రిపుల్‌ఇ సభ్యత్వం ఎంతో ఉపయోగమన్నారు. ప్రొఫెసర్ టెట్సుజీ కుబోయామా మాట్లాడుతూ తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు మెరుగుగా ఉంటాయని, కన్‌స్ట్రక్షన్, మెషిన్ పార్ట్స్ అండ్ టూల్ ఇండస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్, షిప్ బిల్డింగ్ అండ్ షిప్ మెషినరీ వంటి మొదలైన రంగాలలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. జపాన్‌లో ఉద్యోగం చేయాలనుకునేవారికి స్పెసీఫైడ్ స్కిల్డ్ వర్కర్ కేటగిరిలో జపాన్ ప్రభుత్వం ప్రత్యేక వీసాలు ఇస్తుందని తెలిపారు. 2030 నాటికి జపాన్‌లో 60 లక్షలకుపైగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని, ఈ నేపథ్యంలో ఉద్యోగం కోసం జపాన్ వైపు యువత చూడాలని, ఉద్యోగ ఎంపికలో జపనీస్ భాష నైపుణ్యం అనేది కీలకమన్నారు. విద్యార్థులు వీటిపై దృష్టి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, డీన్ ఇంటర్నేషనల్ సెల్ డాక్టర్ శ్రీమంత బసు, కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బసాబి చక్రబర్తి, కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జపాన్ ప్రొఫెసర్

మురుగు కాలువ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ ఎస్‌టి కాలనీ, మాదిగపల్లి గ్రామల్లో నిర్మాణాల్లో ఉన్న మురుగునీటి కాలువ నిర్మాణాలను పరిశీలించినట్లు ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా ఎస్‌టి కాలనీలో కె.మాదిగపల్లిలో డ్రైయినేజీ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, సురేంద్ర, పంచాయతీ సెక్రెటరీ షబానాబాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, మండల సర్వేయర్ కీర్తన, పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

వేరుశనగలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

రైతులకు శిక్షణ ఇస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలకడ

మండల పరిధిలోని కత్తివారిపల్లి గ్రామంలో కలికిరి కెవికె శాస్త్రవేత్తలు వై.పీరుసాహెబ్, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగలో చీడపీడల యాజమాన పద్దతులపై మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో నత్రజని ఎరువు వాడకం వల్ల పురుగులు తెగుళ్ల సమస్య పెరిగి సస్యరక్షణకు అధికంగా రసాయన మందులు వాడవలసి వస్తుందని తెలిపారు. అంకుర దశలో సిఫారసు చేసిన 25 కిలోల యూరియాతో పాటు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్‌పొటాష్ ఎరువును ఒక ఎకరానికి వేసుకోవాలని సూచించారు. సమస్యను తగిన విధంగా గుర్తించకుండా అనవసరంగా డీలర్ల వద్ద నుంచి అవసరంలేని అధిక ధర కలిగిన మిశ్రమ పురుగు మందులను వాడరాదని సూచించారు. చిక్కుడును ఆశించిన పేను బంక నివారణకు రోగార్ మందును లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేయాలని సూచించారు. వేరుశనగలో రెండవసారి కలుపు తీసే సమయంలో తగినంత తేమ లభ్యమైనప్పుడు ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును వేసుకోవడం ద్వారా గింజ పరిమాణం, నూనె శాతం అధికమవుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 155251 సేవలను వినియో గించుకోవాలని సూచించారు. బెట్ట పరిస్థితుల వల్ల వేరుశనగ విత్తుకోలేని రైతాంగం ప్రత్యామ్నాయ పంటగా ఆగస్టు నెలలో తగినంత వర్షపాతం లభించినప్పుడు కంది, ఆముదం, అలసంద లాంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు శ్రీనివాసన్‌రెడ్డి, వై.రామలింగారెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు బి.అనంత్, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

ముద్దనూరు : పోషకాలు అందించే చిరు ధాన్యాల పంటలు సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని కొలవలి గ్రామం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆత్మ వారి సౌజన్యంతో ఎడిఎ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందన్నారు. కొర్ర, సజ్జ, రాగి, అండు కొర్రలు, జొన్నలు, సామలు వంటి చిరుధాన్యాల్లో మనిషికి అవసరమైన పోషకాలు కలిగి ఉంటాయన్నారు. రైతులు చిరు ధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకుని సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో కనీసం 50 ఎకరాలు పంట సాగు అయ్యేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎటిబి04 రాగి విత్తనం మంచి దిగుబడి ఇస్తుందన్నారు. అనంతపురం పరిశోధన కేంద్రంలో రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే కొర్రలో మహానంది, రేనాడు, గరుడ, సర్యనంది రకం విత్తనాలు నంద్యాల పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. జొన్న పంట సాగు చేయాలని ఆసక్తి ఉన్న రైతులు ఎంటిజి-5 రకం అధిక దిగుబడిని ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బిటిఎం రవికుమార్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

పాస్‌పోర్ట్ దారిపోయినది
గుర్రం దినకర్ అను నేనే 24.07.2023వ తేది మంచూరు నుండి వాయల్పాడు కు బస్సులో వస్తుండగా నా బ్యాగ్ పోయింది. అందులో నాయొక్కపాస్‌పోర్ట్ ఉంది.
దయచేసి ఎవ్వరికైన దొరికినచో 70226 55668 ఈ నంబర్‌కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.
నా పాస్‌పోర్ట్ ఇచ్చినచో రూ.5000/- బహుమతిగా ఇస్తాను ఇట్లు...
గుర్రం దినకర్
తండ్రి గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, కొత్తపల్లి
కొత్త మంచూరు (పోస్టు), వాల్మీకిపురం (మం) తాటిగుంటపల్లె, అన్నమయ్య (చిత్తూరు) జిల్లా ఆంధ్రప్రదేశ్.517234

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సూచించారు. మండలంలోని చిన్నగురువలూరు పశువైద్యశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాడిపరిశ్రమను ప్రోత్స హిస్తోందన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పశుబీమా అవకాశం కల్పిం చిందన్నారు. రైతులకు సబ్సిడీతో సమీకృత దాణా సరఫరా చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు చర్మవ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నారని తెలిపారు. పశువైద్యాధికారి సుదర్శన రెడ్డిని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన పశువైద్య భవనాన్ని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శివ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తులసిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

వేంపల్లె పిసిసి మీడి యా చైర్మన్ తులసిరెడ్డి 72వ పుట్టినరోజు వేడు కలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనం గా నిర్వహించారు. స్థాని కంగా ఆయన స్వగృహంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మూలంరెడ్డి ధృవ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తులసిరెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు చేపట్టారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చి కేక్‌ను పంపిణీ చేశారు. గండి రోడ్డులో, రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో తులసిరెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అన్నదానం చేశారు. మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, టిడిపి నాయకులు తులసిరెడ్డిని కలిసి శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులుడాక్టర్ సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు బీగాల రామకృష్ణ, తిరుమల శెట్టి వేమయ్య, ఉత్తన్న, జిల్లా కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, బద్రి, మణికంఠ, అనిల్, సూరి, శివయ్య, కులాయప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంలకు సూచనలిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజల ఆరోగ్యమే వైద్య ఆరోగ్యశాఖ ప్రథమ ధ్యేయమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆశాడే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎం లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నాదని అందుకు అనుగుణంగా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో నిత్యం పర్యటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అందించే వైద్య సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఆస్పత్రి వచ్చే ప్రతి రోగి వివరాలను ఇసి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. తద్వారా రోగి ఆరోగ్య స్థితి గతిని, రోగికి వాడే వైద్య వివరాలను ఆన్‌లైన్ లో ఎక్కడైనా తెలుసుకోవచ్చని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇసి రిజిస్ట్రేషన్ వివరాలు ఎక్కడైనా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి నెల 1, 3వ శుక్రవారం గ్రామాలలో శానిటేషన్, న్యూట్రిషన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒలు, పిహెచ్‌సి సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీముల్లా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణం 14వ వార్డులో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా జన్మదిన వేడుకలు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీముల్లాకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్‌లో ఉన్నప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల సహకారంతో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతల చేపట్టి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముబీనా, ఉర్దూ అకాడమీ ప్రతినిధులు, 14వ వార్డు సచివాలయ కన్వీనర్లు రమాదేవి, రఫీ, మారెన్న, వాసు, ఆర్‌పిలు, రెడ్డెమ్మ, మంజుల గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజును పరామర్శిస్తున్న జగన్మోహన్‌రాజు

టిడిపి నాయకుడిని పరామర్శించిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని తాళ్లపాక పంచాయతీకి చెందిన టిడిపి యువ నాయకుడు సూర్యనారాయణ రాజు మన్నూరు వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో ప్రమాదవశాస్తూ గాయపడి తిరుపతి సురక్ష ఆసుపత్రి నందు శస్త్ర చికిత్స చేయించుకుని తన స్వగృహం నందు విశ్రాంతి తీసుకుంటుండగా మంగళవారం టిడిపి చమర్తి జగన్మోహన్‌రాజు వారిని పరామర్శించారు.త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన వెంట రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్‌రాజు, సీనియర్ నాయకులు బండారు బాలయ్య, సుండుపల్లె మాజీ ఎంపిటిసి మోహన్‌బాబు నాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షురాలు శ్రీవాణి, శివరాంనాయుడు, చంద్రశేఖర్‌రాజు ,వినోద్ రెడ్డి, నాగేంద్ర వెంకటేష్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై నిర్లక్ష్యం తగదు

జమ్మలమడుగు రూరల్ : ఓటర్ జాబితా సవరణలపై నిర్లక్ష్యం తగదని ఆర్‌డిఒ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఓటర్ జాబితా సవరణలో అధికారులకు సహకరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఇవ్వాలన్నారు. మరణించిన వారి ఓటును తొలగించాలన్నారు. ప్రతి మంగళవారం సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డులో గల కరూర్ వైశ్య బ్యాంక్ పైన నాలుగవ అంతస్తులో స్లాబ్ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో విద్యుదా ఘాతానికి గురై మాదిగ సుంకన్న (56) అనే మేస్త్రీ మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయ పడగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల తెలిపి న వివరాల మేరకు.. ఆర్ఎస్ రోడ్డు ప్రధాన రహదారిలో గల భవనంలోని నాలుగవ అంతస్తులో సోమవారం అర్ధరాత్రి సాయినగర్‌లో నివాసమున్న మాదిగ సుంకన్న, బాబునాయక్, కుమార్‌నాయక్, రమేష్‌నాయక్‌లు స్లాబ్ నిర్మాణ పనులు చేస్తున్నారని చెప్పారు. స్లాబ్ పనులు చేస్తుండగా మంగళవారం ఉదయం లిఫ్ట్‌కు ఉన్న విద్యుత్ తీగలు కాంక్రీట్ కడ్డీలపై పడడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యిందని వాటిని ముట్టుకున్న మాదిగ సుంకన్న అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. సుంకన్నను కాపాడే క్రమంలో బాబునాయక్ అనే కార్మి కుడు తీవ్రంగా గాయపడటంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. స్వల్పం గా గాయపడిన కుమార్‌నాయక్, రమేష్‌నాయక్‌లను రాజంపేట ప్రభుత్వ ఆస్ప త్రికి పంపినట్లు పేర్కొన్నారు. సుంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.


మృతి చెందిన సుంకన్న

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని ఆర్‌టిసి బైపాస్ క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారిలో మంగళవారం లారీ ఢీకొని పదవ తరగతి విద్యార్థి సి.ఉదయ్‌కుమార్ దుర్మరణం చెందాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఇంటి వద్ద నుంచి ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శెట్టిగుంట జానకిపురం గ్రామానికి చెందినవాడు కాగా రైల్వేకోడూరులో నివాసం ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.